సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 26 । జనవరి । 2023



విద్యార్థులకు వైద్య పరీక్షలు వేగవంతం 8లో

పీహెచ్‌సీల పరిధిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు వేగవంతం చేశారు.



చిరుధాన్యాల సాగుపై అవగాహన

చిరు ధాన్యాల సాగుపై అవగాహన అవసరం అని ఏవో అరుణ్‌కుమార్ సూచించారు. 8లో



14 గంటల్లో ఫైబర్ బోట్ తయారీ

రాజవొమ్మంగి: అప్పలరాజుపేటలో 14 గంటల్లో ఉప్పాడ మత్స్యకారులు ఫైబర్ బోటు తయారు చేసి ఔరా అనిపించారు.

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

260 మందికి ఉత్తమ సేవా పురస్కారాలు



తలారిసింగి మైదానంలో ఏర్పాటుచేసిన వేదిక

సాక్షి, పాడేరు: కొత్త జిల్లాగా ఆవిర్భవించిన తరువాత తొలిసారిగా జిల్లా కేంద్రం పాడేరులో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పలు అభివృద్ధి పథకాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేస్తారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలుశాఖల అధికారులు,ఉద్యోగులు సుమారు 260 మందికి గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ సేవా ప్రశంస పత్రాలను ఆయన అం దజేస్తారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి



అవగాహన కల్పిస్తున్న నిపుణులు

రంపచోడవరం: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. లలితా కామేశ్వరి సూచించారు. బుధవారం కృషివిజ్ఞాన కేంద్రంలో వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ల ద్వారా పురుగు మందు, ఎరువుల పిచికారీపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతులకు 50 శాతం, రైతు ఉత్పాదక సంఘాలకు 75 శాతం రాయితీపై అందిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఎకరా విస్తీర్ణంలో పది నుంచి 15 నిమిషాల్లో పిచికారీ చేయవచ్చన్నారు.కేవీకే శాస్త్రవేత్తలు డా.ఆదర్శ, క్రాంతికుమార్, వీరాంజనేయులు, ప్రవీణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత



విద్యార్థి కొర్రా సంతోష్‌కుమార్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

జి.మాడుగుల: పాడేరు మండలం మినుములూరులో ఇంటి నుంచి జి.మాడుగుల గురుకుల కళాశాలకు వస్తూ తప్పిపోయిన విద్యార్థి కొర్రా సంతోష్‌కుమార్ ఆచూకీ లభించింది. పత్రికల్లో కథనాలు రావడంతో విశాఖపట్నం జిల్లా గాజువాక పరిసరాల్లో తిరుగుతున్న సంతోష్‌కుమార్‌ను గుర్తించిన పోలీసులు పట్టుకున్నారు. బుధవారం వారు తల్లిదండ్రులకు సమాచారం అందించి స్థానిక పోలీసుస్టేషన్‌లో విద్యార్థిని అప్పగించారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంతో ఎంతో ఉపయోగం



జమాల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

చింతూరు: దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసేందుకు ప్రకృతి వైద్యం ఎంతగానో దోహదపడుతుందని చింతూరుకు చెందిన ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ అన్నారు. తిరుపతిలో మూడు రోజుల పాటు జరిగిన పారంపర్య వైద్యుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చన్నారు. ఆయుర్వేద ఔషధ మొక్కలను పెంచడం ద్వారా భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రసాదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్ రాజు, సావిత్రమ్మ తదితరులు సత్కరించినట్టు జమాల్‌ఖాన్ తెలిపారు.

రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో మూడు మండలాలు.. 50 గ్రామాలకు ఉపయోగకరమైన పందిరిమామిడి- చవిటిదిబ్బలు మార్గంలో అటవీశాఖ అభ్యంతరాల వల్ల నిలిచిపోయిన పది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. ఇందుకు సంబంధించి తొలివిడత అనుమతులను కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంజూరు చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించడంతో సమస్య పరిష్కారమైంది.

గ్రీన్ సిగ్నల్..!

- **పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణానికి అనుమతులు**
- కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంజూరు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే ధనలక్ష్మి
- ఆయన చొరవతో వెంటనే పరిష్కారం
- మూడు మండలాలకు చెందిన 50 గ్రామాలకు ఉపయోగకరం

రంపచోడవరం: నాలుగేళ్ల తరువాత పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. అటవీ అభ్యంతరాలతో 2019లో నిలిచిపోయిన ఈ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మొదటి దశ అనుమతులు మంజూరు చేసింది. రెండో దశ అనుమతులు లాంచనమేనని అధికారులు చెబుతున్నారు.

సీఎం దృష్టికి సమస్య..

రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులు, రోడ్డు నిర్మాణం అవసరాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు అనుమతులు లభించాయి.

రూ. 28 కోట్లతో..

కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో అభివృద్ధి పనులకు ఎల్‌డబ్ల్యూఈ (లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రామిజం) పథకంలో పందిరిమామిడి -చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రూ. 28 కోట్ల వ్యయంతో 30 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి నిధులు వెచ్చించింది. ఇప్పటివరకు 20 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయింది.

- భీమవరం-నరసాపురం మధ్య పది కిలోమీటర్లు రోడ్డు అటవీ అభ్యంతరాలతో 2019లో అటవీశాఖ అధికారులు నిలిపి వేశారు. దీంతో పది కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. దీంతో రంపచోడవరం నుంచి పందిరిమామిడి మీదుగా చవిటిదిబ్బలు, వై.రామవరం వెళ్లే ఆర్టీసీ సర్వీసును నిలిపివేశారు. గిరిజనుల అభ్యర్థన మేరకు పది రోజుల క్రితం బస్సు సర్వీసును పునరుద్ధరించారు.

50 గ్రామాలకు దగ్గర మార్గం

పందిరిమామిడి- చవిటిదిబ్బలు రోడ్డు నిర్మాణం వల్ల నాలుగు మండలాల గిరిజనులకు రంపచోడవరం ఐటీడీఏకు దగ్గర మార్గం అందుబాటులోకి వస్తుంది. రంపచోడవరం, మారేడుమిల్లి, వై రామవరం మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల గిరిజనులకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగం.

- వై.రామవరం మండల కేంద్రం నుంచి రంపచోడవరానికి ప్రస్తుతం అడ్డతీగల దగ్గర వేటమామిడి, గంగవరం మీదుగా వస్తున్నారు. సుమారు 100 కిలోమీటర్లు పైగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. పందిరిమామిడి-చవిటిదిబ్బలు రోడ్డు అందుబాటులోకి వస్తే 40 కిలోమీటర్ల ప్రయాణం తగ్గుతుందని ఆయా ప్రాంతాల గిరిజనులు తెలిపారు.
- పది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి స్టేజ్ -1 అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని రంపచోడవరం ఆర్‌అండ్‌బీ జెఈ ప్రదీప్ తెలిపారు.



మధ్యలో నిలిచిపోయిన పందిరిమామిడి-చవిటిదిబ్బలు రోడ్డు (ఫైల్)

ఇబ్బందులు తప్పినట్టే

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చొరవతోనే అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు రావడంలో ఎంతో కృషి చేశారు. ఈ రోడ్డులో అనేక చోట్ల కల్వర్టు నిర్మించడం వల్ల కొండవాగులు పొంగినా ప్రయాణానికి ఎటువంటి ఇబ్బంది లేదు. గతంలో వర్షం పడినప్పుడు వాగులు పొంగి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి.

– పండా వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ, రంపచోడవరం

పదేళ్ల అంధకారానికి విముక్తి

- **గడ్డిబందలు ఆదివాసీలకు విద్యుత్ వెలుగులు**
- **గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి**
- **వెనువెంటనే పరిష్కారానికి చర్యలు**
- రూ.2.5 లక్షలతో సరఫరా పునరుద్ధరణ

పాడేరు మండలం కించూరు పంచాయతీలో పదేళ్లుగా అంధకారంలో ఉన్న గడ్డిబందలు గ్రామానికి విముక్తి లభించింది. గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అపహరణకు గురైన వైర్లను పునరుద్ధరించి అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించారు.



మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ సిబ్బంది, సర్పంచ్ రాంబాబు

సాక్షి,పాడేరు: మండలంలోని కించూరు పంచాయతీలో ఆదివాసీ గ్రామం గడ్డిబందలులో 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. పంచాయతీ కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న ఈ గ్రామానికి గతంలో విద్యుత్‌లైన్ ఉండేది. వైర్లు అపహరణకు గురి కావడంతో పదేళ్లుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. గతేడాది డిసెంబర్ 10న గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి సర్పంచ్ వంతాల రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు సమస్య తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ వైర్లఅపహరణపై పోలీసుల ద్వారా నివేదికను రప్పించుకున్న పాడేరు ఏడీ భాస్కరరావు, ఏఈ ప్రభాకర్ రూ.2.5 లక్షలతో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు.

ఎంతో శ్రమించిన సిబ్బంది

అటవీ ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభాలకు వైర్లు అమర్చేందుకు సిబ్బంది ఎంతో శ్రమించారు. మంగళవారం సాయంత్రం ఆదివాసీల నివాసాలకు విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించారు. వీరికి సర్పంచ్‌లు వంతాల రాంబాబు, సీదరి రాంబాబు సహకారం అందించారు. సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ముందుగానే వారంతా టీవీలు, డిష్‌లు కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నామని ఎంతో సంతోషంతో ఆదివాసీలు తెలిపారు.

ఎమ్మెల్యే కృషితో పరిష్కారం



కించూరు పంచాయతీలో సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఎంతో కృషి చేస్తున్నారు.గతంలో మారుమూల గ్రామాల రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ఇప్పుడు విద్యుత్ సమస్య పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉంది. ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– వంతాల రాంబాబు, కించూరు సర్పంచ్, పాడేరు మండలం

ఇష్టపడి చదివితే అద్భుతాలు

- పట్టుదలతో దేనినైనా సాధించవచ్చు
- విశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి
- టెన్త్ విద్యార్థుల సామర్థ్యం పరిశీలన



విద్యార్థినితో చదివిస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

కొయ్యూరు: విద్యార్థులు ఇష్టపడి చదివితే అద్భుతాలు సాధిస్తారని విశాఖపట్నం జోన్-1 విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆమె స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ పట్టుదల ఉంటే కష్టపడే మనస్తత్వం వస్తుందన్నారు. ఎవరైతే తెల్లవారుజామున లేచి చదువుతారో వారికి మంచి మార్కులు వస్తాయన్నారు. దాదాపు అరగంట పాటు ఆమె పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆంగ్లంలో 90కు పైగా మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు లెక్కలు సబ్జెక్టులో 60లోపు మార్కులు తెచ్చుకోవడంపై ఆమె అసంతృప్తి చెందారు. ఎక్కువ మార్కులు లెక్కలులో వస్తాయని అలాంటిది దానిలో తక్కువ వచ్చి ఆంగ్లంలో ఎక్కువగా రావడం ఏమిటని ప్రశ్నించారు. గణితం బోధించే ఉపాధ్యాయుడికి ప్రమాదం జరగడంతో ఆయన సెలవులో ఉన్నారని హెచ్‌ఎం రామారావు ఆమెకు తెలిపారు. గణితంలో ఇప్పటి వరకు 13 చాప్టర్లు అయ్యాయని విద్యార్థులు తెలిపారు. ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ గణితానికి సూత్రాలు కీలకమన్నారు. సూత్రాలు తెలిస్తే లెక్కలు చాలా సులువుగా చేయవచ్చన్నారు. హెచ్‌ఎం ప్రతీరోజు 4 నుంచి 5 సూత్రాలను బోర్డుపై రాసి విద్యార్థులకు నేర్పాలని ఆమె ఆదేశించారు. లెక్కలు తరువాత ఎక్కువగా మార్కులు తెచ్చే సబ్జెక్టు ఫిజిక్స్ అని చెప్పడంతో సంతృప్తి చెందారు. తెలుగుకు సంబంధించి విద్యార్థులతో పద్యం, తాత్పర్యం చదివించారు. పదిలో బాగా చదివితే మంచి ర్యాంకులు వస్తాయన్నారు. ఉన్నతపాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు ఇవ్వడం మూలంగా వారిలో పాఠాలు వినేందుకు ఆసక్తి పెరిగిందని తెలిపారు. చింతపల్లి మండలంలో లంబసింగి, చింతపల్లి, పెదవలస పాఠశాలలను పరిశీలించినట్టు ఆమె తెలిపారు. ఎంఈవో బోడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

చింతపల్లి: మండలంలోని అన్నవరంలో బుధవారం అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కొర్రా బాలరాజు (23)కు కొత్తూరు బయిలుకు చెందిన బాలికతో వివాహం జరిపించేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీవో రమ్య ఆధ్వర్యంలో అధికారుల బృందం కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో వివాహాన్ని నిలిపివేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వారికి అధికారులు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

- పందిరిమామిడి కేవీకేలో శాస్త్రవేత్తల సూచన



కేవీకేలో శిక్షణ పొందుతున్న రైతులు

రంపచోడవరం: రైతులు ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి ప్రకృతి విధానంలో సాగు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా.లలితాకామేశ్వరి సూచించారు. కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల్లో అధిక రసాయనాలు వాడకంతో తక్కువ ఆదాయంతో పాటు నాణ్యత లేని ఆహారాన్ని పొందుతున్నామన్నారు. ఈ పరిణామాలన్ని దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం-విస్తరణ పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో పంటలకు కావాల్సిన పోషకాల మిశ్రమం, ద్రావణాలు, కషాయాలు తయారీ, ఉపయోగం, వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీసీఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు ప్రకృతి వ్యవసాయం, విస్తరణ అంశాలను రైతులకు వివరించారు. పంటల రైజోబియం ,అజటోబ్యాక్టర్, భాస్వరం, పొటాషియం కరిగించే బాక్టీరియా, జీవామృతంపై అవగాహన కల్పించారు. పీఎంవో రాంబాబు, కేవీకే శాస్త్రవేత్తలు పి.రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఘనంగా ఓటర్ల దినోత్సవం
- సీనియర్ సిటిజన్లకు సత్కారం
- వాడవాడలా అవగాహన ర్యాలీలు



ఓటరు కార్డును అందజేస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్



యువ ఓటరుకు ఎపిక్ కార్డు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



చింతూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

సాక్షి,పాడేరు: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అధికారులు,ఉద్యోగులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.సీనియర్ ఓటర్లను పూలమాలలతో సన్మానించారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఎపిక్ కార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఒకసారి ఎన్నుకున్న ప్రజాప్రతినిధి ఐదేళ్ల వరకు పదవిలో ఉంటారని, ఈమేరకు మంచి వ్యక్తికి ఓటు వేసి,ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఎస్‌డీసీ వీవీఎస్.శర్మ,ఇన్‌చార్జి ఏవో చిన్నికృష్ణ, తహసీల్దార్లు రామారావు, త్రినాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు ఎంతో ప్రధానమైనది

చింతూరు: సమాజంలో ఓటుహక్కు ఎంతో ప్రధానమైనదని, ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం చింతూరులో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆయన స్వయంగా బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నాయకులను ఎన్నుకునేందుకు ఓటు ఆయుధంలా ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ సాయికృష్ణ, సీఐ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ నూతనంగా ఓటు హక్కు కల్పించిన వారికి ఓటర్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం: అర్హులైన యువత ఓటరు నమోదుగా చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. ఉద్యోగులు, పాఠశాల,కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని పీఎంఆర్‌సీ వద్ద ఆయన ప్రారంభించారు. అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులు, ఉద్యోగులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం లెనోరా ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఓటు హక్కు వినియోగంపై జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ఐదుగురు సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ముగ్గురికి ఓటరు ఎపిక్ కార్డులు అందజేశారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కుమార్‌బాబు, వీఆర్వోలు గణపతిరెడ్డి, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి,పాడేరు: ఓటరు దినోత్సవం సందర్భంగా ఐటీడీఏలో పీవో గోపాలకృష్ణ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏపీవోలు ఎం.వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.



అధికారులు,ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



రంపచోడవరంలో సీనియన్ సిటిజన్లను సత్కరిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్



పాడేరు సమీపంలోని తుమ్మరమెట్ట పంట భూముల వద్ద చలిమంట కాగుతున్న గిరి యువకులు

వణుకుతున్న మన్యం

- చలిగాలుల విజృంభణ
- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- గడ్డివాములపై గడ్డకట్టిన మంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు తీవ్రత నెలకొంటోంది. అర్ధరాత్రి సమయంలో పొగమంచు కురుస్తుండడంతో చలి మరింత విజృంభిస్తోంది. బుధవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 4.5 డిగ్రీలు.అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 7.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలులు తీవ్రతకు మన్యం వాసులు వణికిపోతున్నారు. చలిమంటలను ఆశ్రయించారు. పాడేరులోని తుమ్మరిమెట్ట మార్గంలో పంట భూముల వద్ద బుధవారం ఉదయం కూడా గడ్డివాములపై మంచు గడ్డకట్టిన దృశ్యాలు కనిపించాయి.



పాడేరులో గడ్డిపై గడ్డకట్టిన మంచు

చిరుధాన్యాల సాగుపై అవగాహన

హుకుంపేట: చిరు ధాన్యాల సాగుపై గిరి రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ అధికారి సరోజిని ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ఎక్కువ విస్తీర్ణంలో చేయాలని సూచించారు. ప్రతీ 250 ఎకరాలకు చిరుధాన్యం ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసుకుని దానికి సంబంధించి గ్రూపుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల సాగుతో లాభాలు పొందవచ్చున్నారు. అధికారులు సూచనలు, సలహాలతో సాగు చేయాలన్నారు.ఏవో సరోజిని, సర్పంచ్ సత్యవతీ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు వేగవంతం

జి.మాడుగుల: పాడేరు డివిజన్‌లో ఉన్న 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శాఖ సిబ్బంది, విద్యాశాఖాధికారుల సమన్వయంతో పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలను పూర్తి చేయాలని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్ ఆదేశించారు. మండలంలోని పెదలోచలి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. గెమ్మెలి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం 10 మందిని గుర్తించి ఉన్నత ఆస్పత్రులకు తరలించాలని ఆయన ఆదేశించారు. సికిల్‌సెల్ అనీమియా కేసులను గుర్తించి తదుపరి పరీక్షల కోసం పాడేరులోని జిల్లా ఆస్పత్రికి తరలించి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని సూచించారు. అన్ని వ్యాధులకు సంబంధించి పూర్తిస్థాయి మందులు అందుబాటులో ఉంచుకొవాలని, వైద్య శిబిరాలకు వైద్యాధికారి, క్షేత్రస్థాయి సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం పాఠశాల వసతి గృహంలోని వంటశాలను, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని ఆయన పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలో 204 మంది విద్యార్థులకు గాను 95 మందికి గెమ్మెలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విష్ణుష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో రక్తహీనత, చర్మవ్యాధులు, దగ్గు, తక్కువ బరువు, కంటి చూపు, చెవి, దంత సమస్యలతో బాధపడుతున్న 24 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, హెచ్ఎం బి.ధర్మేంద్ర, పీహెచ్ఎన్ ఈశ్వరమ్మ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్య నిర్దేశకులదే విజయం


జయకేతనం: రఘు టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ జట్టు


విజయదరహాసం: ఎస్ఆర్ జూనియర్ కళాశాల జట్టు


విజయహేల: ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

హోరాహోరీగా 'సాక్షి'ప్రీమియర్ లీగ్

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ టోర్నీలో రెండో రోజు పోటీల్లో లక్ష్య నిర్దేశకులే విజయం సాధించారు. లక్ష్య ఛేదనలో వెనుకబడి జట్లు పరాజయం పాలయ్యాయి. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు మ్యాచ్‌ల్లో టాస్ ఓడిన జట్లు తొలుత బ్యాటింగ్ చేసి లక్ష్యాన్ని నిర్దేశించి విజయం సాధించాయి. జూనియర్స్‌కు జరిగిన హోరాహోరీ పోరులో సాంకేతిక పాలిటెక్నిక్ జట్టు కేవలం ఒక్క పరుగు వెనుకబడి ఓటమి పాలైంది. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

- రెండో రోజు తొలి మ్యాచ్‌లో రఘు టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. పాల్ 19 పరుగులు చేశాడు. వరుణ్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల నాలుగు వికెట్లు కోల్పోయి 63 పరుగులే చేసి ఓటమి పాలైంది. సాయి 26 పరుగులు చేశాడు.
- తర్వాత మ్యాచ్‌లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఎనిమిది ఓవర్లలో ఒక వికెట్‌కు 126 పరుగులు చేసింది. రాజ్‌కుమార్ (54) అర్ధసెంచరీ సాధించాడు. ప్రతిగా అశ్వార్‌దాస్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 37 పరుగులే చేసి ఓటమి పాలైంది. హర్ష రెండు వికెట్లు తీశాడు.
- మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. తనిష్క్ 34 పరుగులు చేశాడు. వంశీ, మురళీ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఎస్వీఎల్ఎస్వీపీ జూనియర్ కళాశాల జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 52 పరుగులే చేసి ఓటమి పాలైంది. చందు 26 పరుగులు చేశాడు. కుమార్ రెండు వికెట్లు తీశాడు.
- చివరి మ్యాచ్‌లో ఏవీఎన్ కళాశాల జట్టు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. మూడు వికెట్లకు 81 పరుగులు చేసింది. 33 అదనపు పరుగులు లభించాయి. ప్రతిగా సాంకేతిక జట్టు బ్యాటర్ వివేక్ 20 బంతుల్లోనే 38 పరుగులు చేసినా.. చివరికి మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగిసింది. హర్ష, చెన్నారావు, మోహన్ చెరో వికెట్ తీశారు.

District sponsor

CMR SHOPPING MALL The joy of life ANDHRAPRADESH | TELANGANA


విజయోత్సాహం: సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

OFFICE OF THE PROJECT OFFICER, I.T.D.A., RAMPACHODAVARAM & ADDITIONAL DISTRICT MAGISTRATE, A.S.R DISTRICT.

SHORT TENDER NOTICE

(FOR SUPPLY OF FOOD TO THE IN- PATIENTS AT AH-RAMPACHODAVARAM, CHC- ADDATEEGALA, CHC-Y.RAMAVARAM)

Sealed Tenders are invited from the firms those who are having license from Medical Department for supply of food to the In- patients and Duty doctors of Area Hospital, Rampachodavaram and CHCs of Addateegala and Y.Ramavaram on or before **03.02.2023 by 2.00P.M.** as per the specifications and terms & conditions prescribed in the tender schedule. The tenders will be opened on the same day at 3.00 P.M after negotiations by the Committee. The filled-in tender schedule shall be put in the Tender Box in **ITDA, Rampachodavaram before 2.00 PM on 03.02.2023.** No tenders through post will be entertained. The tender schedule shall reach this office within the scheduled time, otherwise the tender schedules are summonly rejected. Tenders without EMDs & tender Application fee will also summonly be rejected.

(Phone No.9348344082, Toll Free No.18004252123).

E.MD (security deposit) AH, Rampachodavaram - 1lakh

CHC - Addateegala - 50.000/-, CHC = Y.Ramavaram - 50000/-

Payment on DD to The Project Officer, ITDA, Rampachodavaram

PROJECT OFFICER, ITDA, Rampachodavaram

వంద కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం: అక్రమంగా తరలిస్తున్న వంద కేజీల గంజాయిని మోతుగూడెం పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకొని, ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. ఎస్‌ఐ వి. సత్తిబాబు తెలిపిన వివరాలు ప్రకారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కు అందిన సమాచారం మేరకు చింతూరు ఏఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక గొందిగూడెం జంక్షన్ వద్ద సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం సుకుమామిడి నుంచి మహారాష్ట్ర ముంబైకి టయోటా ఇన్నోవా కారులో నాలుగు బస్తాలలో తరలిస్తున్న వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న బద్లాపూర్ ధానే మహారాష్ట్రకు చెందిన అష్ఫాక్ అష్రఫ్ ఖాన్, తూర్పు ముంబైకి చెందిన రయిన్ రహీమ్ ఖాన్, ఒడిశా మల్కన్‌గిరికి చెందిన బరున్‌రే, మాణిక్ శారదార్, సాధు గొలారి, జుధేస్తి హంతల్ పరేష్ పొద్దార్ అనే ఏడుగురి నిందితులను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ఒక కారు, మూడు బైకులను సీజ్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

యాజమాన్య పద్ధతుల సాగుతో లాభాలు

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజన రైతులు జీడిమామిడి పంట ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఉత్పాదకలో చాలా తక్కువగా ఉందని, రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడమే కారణమని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లలితాకామేశ్వరి అన్నారు. కెవీకెలో బుధవారం జీడిమామిడి సుస్థిర సాగు, ప్రోసెసింగ్ ద్వారా రైతుల ప్రగతిపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమాన్ని డైరెక్టరేట్ ఆఫ్ కాష్యు(జీడిమామిడి) కోకో అభివృద్ధి సంస్థ ఆర్థిక సహకారంతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ టి.క్రాంతికుమార్ జీడిమామిడి అంటు మొక్కల ఎంపిక, సాగు, తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు. జీడిపిక్కల నుంచి యంత్రాల ద్వారా పప్పు తీసే విధానాన్ని వివరించారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు జీడిపప్పుతో విలువ ఆధారిత పదార్థాలు తయారు చేసుకుని మార్కెట్ చేసుకోవాలని పీహెచ్‌ఓ చిట్టిబాబు సూచించారు. కెవీకె శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదర్శ, పి.రాజశేఖర్, ఆర్.ప్రవీణ్‌బాబు, వీరాంజనేయులు రైతులు పాల్గొన్నారు.

ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు

టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డిని కలిసి సత్కరిస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ, కార్మికసంఘం నాయకులు

చోడవరం: దేశంలో అన్ని ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి తిరుమల,తిరుపతి దేవస్థానం నుంచి సహకారం అందిస్తున్నామని టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. చోడవరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చోడవరం పరిసరాల్లో ఉన్న ప్రముఖ ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయాలని ఛైర్మన్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. దీనిపై సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు

రాష్ట్రంలోనే కాకుండా దేశంలో అనేక ప్రముఖ ప్రాచీన దేవాలయాలకు అభివృద్ధికి మూడేళ్ల నుంచి టీటీడీ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. చోడవరంలో ప్రాచీన దేవాలయాలైన స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, స్వయంభూ గౌరీశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాలతోపాటు వడ్డాది వేంకటేశ్వరస్వామి, రోలుగుంట వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఏఏ దేవాలయాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయాలో లేఖ రూపంలో ఇస్తే టీటీడీ ఇంజినీరింగ్ అధికారులను పంపించి ప్రతిపాదనలు తయారు చేయడంతో పాటు రెండు నెలల్లో మంజూరు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.

గోవాడ సుగర్స్ విషయం సీఎం దృష్టికి..

చెరకు రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని పరిశీలించిన ఆయనకు ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి, ప్రస్తుత పరిస్థితిపై ధర్మశ్రీ వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.150 కోట్ల అప్పుల్లో ఫ్యాక్టరీ కూరుకుపోయిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక రూ.120 కోట్ల అప్పు తీర్చడంతోపాటు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కొంత గ్రాంట్ ఇచ్చి ఆదుకున్నారని ధర్మశ్రీ వివరించారు. అయితే ఫ్యాక్టరీ రానున్న రోజుల్లో మరింతగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వ సహకారంతోపాటు ఉప ఉత్పత్తుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనికి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు. చెరకు రైతుల సంక్షేమంతోపాటు ఫ్యాక్టరీని అభివృద్ధి విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి. సన్యాసినాయుడు, ఏవో పప్పల రమణమూర్తి, గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు కె.వి.వి.భాస్కరరావు తదితరులు కలిసి మర్యాద పూర్వకంగా సత్కరించారు. అనంతరం ఫ్యాక్టరీ, కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వడ్డాది వెంకన్న ఆలయం అభివృద్ధికి వినతి

బుచ్చెయ్యపేట: వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. చోడవరం వచ్చిన సుబ్బారెడ్డిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు,ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి,జెడ్పీటీసీ దొండా రాంబాబు,డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ,వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తదితరులు బుధవారం కలిసి మండల సమస్యలను వివరించారు. విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ప్రజలకు ముఖ్య రహదారి అయిన భీమునిపట్నం–నర్సీపట్నం రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న వంతెన కూలిపోయిందని కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం


ఏపీఆర్డీసీ ఎండీ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లతో చర్చిస్తున్న రాష్ట్ర రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

అడ్డతీగల: ప్రజాప్రయోజనార్థం కీలకమైన రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ తెలిపారు.ఈ మేరకు బుధవారం అమరావతిలోని ఏపీ ఆర్డీసీ ఎండీ ఎల్.శ్రీనివాస రెడ్డితో సమావేశమై పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. రోడ్ల నిర్మాణాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.ఈ మేరకు అల్లూరి జిల్లాలోని చెరుకుంపాలెం–జెడ్డంగి, మారేడుమిల్లి–చింతూరు, జెడ్డంగి–గొంటువానిపాలెం, దూసరిపాము–బోయపాడు రోడ్లు పునర్నిర్మాణంతో పాటు నూతనంగా నిర్మించవలసిన అంశాలను ఎండి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రాజవొమ్మంగి మండలంలోని రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారన్నారు. ఆయా రోడ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపునకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరామన్నారు. ఏలేశ్వరం–అడ్డతీగల మండలాలను కలుపుతూ రమణయ్యపేట–జెడ్డంగి అన్నవరం మధ్య 10 కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.25.80 కోట్లు నిధులు కేటాయింపు జరిగినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకురాకపోవడం, కాంట్రాక్టు పిరియడ్ వచ్చే మార్చి నాటికి ముగుస్తున్న నేపథ్యంలో రీ టెండర్లు పిలవడానికి కార్యా చరణ చేస్తున్నారన్నారు. ఫిబ్రవరి మాసంలో రీ టెండర్లు పిలిచి కొత్త కాంట్రాక్టర్‌కి పనుల ను అప్పగించి రోడ్డు ని ర్మాణం జరిగేలా చేయడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల రెండో విడత కౌన్సెలింగ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. 21 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈనెల 20న తొలి విడతలో 128 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఇంకా 30 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. విమ్స్‌లో 24 పోస్టులకు గాను తొలి విడత 18 పోస్టులు, రెండో విడత 3 పోస్టులు, ఇంకా 3 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో నిపీహెచ్‌సీల్లో 108 పోస్టులకు గాను తొలి విడత 81 పోస్టులు, రెండో విడత 9 పోస్టులు, 18 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టులకు గాను తొలి విడత 29 పోస్టులు, రెండో విడత 9 పోస్టులు, ఇంకా 9 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి తెలిపారు. మొత్తం 179 పోస్టులకు గాను రెండు విడతల్లో 149 పోస్టులు భర్తీ చేశామని, ఇంకా 30 పోస్టులు వరకు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్-2 శిక్షణ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–2 శిక్షణను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకుడు కె.అభిమన్యుతో కలిసి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు మేయర్ మాట్లాడుతూ విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో కోచింగ్ ప్రారంభించిన అల్లూరి స్టడీ సర్కిల్ నిర్వాహకులను అభినందించారు. శిక్షణలో చేరేందుకు ఆసక్తి గల యువత మరిన్ని వివరాలకు 80084 12798లో తెలుసుకోవచ్చు. నిర్వాహక సభ్యులు అభిషేక్, హర్షకుమార్ పాల్గొన్నారు.

OFFICE OF THE PROJECT OFFICER, I.T.D.A., CHINTOOR & ADDITIONAL DISTRICT MAGISTRATE, A.S.R DISTRICT.

SHORT TENDER NOTICE

(FOR SUPPLY OF FOOD TO THE IN-PATIENTS AT AH-CHINTOOR, CHC-KUNAVARAM)

Sealed Tenders are invited from the firms those who are having license from Medical Department for supply of food to the In- patients and Duty doctors of Area Hospital, Chintoor and CHC of Kunavaram on or before **02.02.2023 by 2.00 P.M.** as per the specifications and terms & conditions prescribed in the tender schedule. The tenders will be opened on the same day at **3.00 P.M** after negotiations by the Committee. The filled-in tender schedule shall be put in the Tender Box in ITDA, **Chintoor before 2.00 PM on 02.02.2023.**

(Phone No.9441360327, 8121729228).

PROJECT OFFICER ITDA, Chintoor

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED DISTRICT MANAGER'S OFFICER COLLECTORATE COMPOUND, ALLURISITARAMARAJU, ALLURISITARAMARAJU DISTRICT.

No.P.Admn.CSC-4/48(1)/Recru/Contract/2022-23 Dt. 24.01.2023

EMPLOYMENT NOTIFICATION

Applications are invited from the interested and eligible local candidates **(Newly formed Allurisitaramaraju District Jurisdiction only)** for recruitment of Accountant Grade-III on contract basis for a period of (1) year in APSCSCL to work at the District Office, Allurisitaramaraju through District Selection committee headed by the Joint Collector & EOED., Category wise vacancies to be filled are detailed hereunder.

Requisite Qualification, Eligible Category and the monthly remuneration

Sl. no	Name of the Posts	No. of Posts	Eligible Category	Qualifications prescribed	Experience	Consolidated monthly remuneration
1	Accountant Grade-III (on contract basis for a period of one year)	01	Merit Basis	i. CA/CMA Semi Qualified i.e. Inter passed. ii. Computer Skills	02 years experience in relevant field	Rs. 30,000/- per month

Maximum Age limit: 35 years for General Category and 40 years for Reserved.

The interested candidates can apply after download the form of application from website of http://apscscl.in and sending their applications to this office on working days only through Register Post or in person to reach this office and the last date for receipt of applications is **14.02.2023 upto 5.00 PM** and verification of Original Certificates will be on **16.02.2023** and selected candidates shall report to duty on 22.02.2023. **(Applications available from 25.01.2023)**

Station : Allurisitaramaraju
Date : 24.01.2023

Joint Collector & EOED
APSCSCL: ALLURISITARAMARAJU